క్లుప్తంగా

కేజీబీవీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

ములుగు : గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు కేజీబీవీ ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధుసూదన్, సతీశ్ శనివారం ఓ సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. కేజీబీవీల్లో బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా చొరవ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సెలవులు మంజూరు చేయాలని, ఆరోగ్య భద్రత కల్పించడంతోపాటు హెల్త్ కార్డులు అందించాలని, వార్డెన్లను నియమించాలని కోరారు.

పీరీల ఊరేగింపు



మంగపేట : మండల కేంద్రంలో ముస్లిములు మొహర్రం పండుగను శనివారం జరుపుకున్నారు. పీరీలను ఊరేగించారు. ముస్లింవాడలోని జామే మజీద్ నుంచి ముస్లింలు పీరీలతో డప్పుచప్పుళ్ల నడుమ నృత్యాలు చేస్తూ మండల కేంద్రంలోని వై జంక్షన్ వరకు ఊరేగించారు. చెరుపల్లి, కమలాపురం నుంచి హిందువులు, ముస్లిములు పీరీలను తీసుకొచ్చారు. కార్యక్రమంలో అఫ్రోజ్, బురాన్, ముస్తాఫా, ముజీం, ముజాఫర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాజేడు : మండలంలోని జగన్నాథపురం జంక్షన్‌లో వాజేడు పోలీసులు శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. హైవేపై వాహనాలను ఆపి సోదా చేశారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై



గణపురం : నూతన ఎస్సైగా మచ్చ సాంబమూర్తి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన్ను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

వరదకు కొట్టుకొచ్చిన కంటైనర్

మల్హర్: వరద ప్రవాహంతో ఓ కంటైనర్ మండలంలోని తాడిచర్ల మానేరు వైపు శనివారం కొట్టుకొచ్చింది. రెండు రోజులు పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో వరద ఉధృతి వచ్చిన విషయం తెలిందే. దీంతో తాడిచర్ల మానేరు కంటైనర్ కొట్టుకొచ్చి, వంతెన కింది ఫిల్లర్ వద్ద ఆగింది. వరద తగ్గడంతో మానేరు వైపు వెళ్లి గ్రామస్తులు కంటైనర్‌ను గుర్తించి సమాచారాన్ని పోలీసులకు అందజేశారు. కొయ్యూరు ఎస్సై వి.నరేష్ అక్కడికి చేరుకొని కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

దుప్పట్ల పంపిణీ

భూపాలపల్లి రూరల్ : వరద బీభత్సంతో సర్వం కోల్పోయిన మండలంలోని మోరంచపల్లి వరద బాధితులకు శనివారం ఇంటింటికి బీజేపీ నాయకులు చెద్దర్లు, దుప్పట్లు, చాపలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తి సత్యపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కో–కన్వీనర్ చాడ రఘునాథరెడ్డి, జిల్లా నాయకులు ముడుపు అశోక్‌రెడ్డి, మనో హర్, బీజేవైఎం నాయకులు గాలిఫ్, జంజర్ల సురేష్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ కుటుంబానికి ఆర్థికసాయం



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు మాచర్ల వెంకటేశ్వర్లు ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబానికి రేగొండ సొసైటీ డైరెక్టర్ చల్లగురుగుల సుదర్శన్ శనివారం ఆర్థికసాయం న్ని అందించారు. తొలుత ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట వార్డు సభ్యులు మాచర్ల నాగమణిమురళి, డీలర్ రవి, వెంకట్రాజం, మండల తిరుపతి, పల్నాటి సాయి, తదితరులు ఉన్నారు.

తగ్గుతున్న గోదావరి ఉధృతి

ఏటూరునాగారం : భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన నీటితో కొనసాగుతున్న గోదావరి ఉధృతి తగ్గుతోంది. మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక చేసిన విషయం తెలిసిందే. శనివారం ఉదయం 16.600 మీటర్ల ఎత్తులో ప్రవహించిన గోదావరి సాయంత్రం ఏడు గంటల వరకల్లా 16.540 మీటర్లకు చేరుకుంది. వర్షాలు తగ్గడంతో ఎగువ ప్రాంతం నుంచి వరదలూ తగ్గాయి. దీంతో గోదావరి నుంచి నీటి ప్రవాహనం తగ్గుముఖం పట్టింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు, రైతన్నలు ఊపిరి పీల్చుకుంటున్నారు.

సమ్మక్క సాగర్ వద్ద..

కన్నాయిగూడెం : సుమారు 10 రోజులుగా ఉగ్ర రూపం దాల్చిన గోదావరి శనివారం శాంతించింది. మండలంలోని తుపాకులగూడెంలో ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద శనివారం ఉదయం వరకు పెరుగుతూ వచ్చి 16.80 లక్షలకు చేరిన నీటిమట్టం సాయంత్రం 13.90 లక్షలకు తగ్గింది. బ్యారేజీ వద్ద 85.10 మీటర్ల నీటిమట్టం కొనసాగుతోంది.

వెంకటాపురం (కె) : మండలంలో గోదావరి వరద ఉధృతి తగ్గింది. శనివారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత వరద తగ్గుముఖం పట్టింది. మండలంలోని బోదాపురం, కుక్కతోగు వాగు, బల్లకట్టు వాగుల వద్ద రోడ్లపైకి చేరిన వరద నీరు ఇంకా తొలగకపోవడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని చర్ల మండలానికి రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన వారిని పాత్రాపురం వద్ద మోకాళ్లలోతు వరద నీటిలో నుంచి ట్రాక్టర్‌పై తరలిస్తున్నారు.

నీట మునిగిన పంట పొలాలు

మంగపేట : మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతం వెంట ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. రెండ్రోజులుగా



వెంకటాపురం (కె) : బోదాపురం వద్ద రోడ్లపైకి చేరిన వరద నీరు

గోదావరి వరద ఉధృతి పెరగడంతో శనివారం సాయంత్రం వరకు కమలాపురం ఇంటేక్ నుంచి గ్రామంలోని ఎర్రవాగుబ్రిడ్జి, గుడ్డేలుగులపల్లిలోని జనావాసాల సమీపంలోకి చేరుకున్నాయి. ఎర్రవాగు ఒడ్డు వెంట ఉన్న సుమారు 20–30 ఎకరాలకుపైగా పొలాలు నీట మునిగాయి. సుమారు 12 ఎకరాలకుపైగా నాటు వేసిన వరిపొలంతోపాటు నారుమడి మునిగిపోయింది. అలాగే బోరునర్సాపురం, మల్లూరు, కత్తిగూడెం, ఆకినపల్లి మల్లారం గ్రామాల్లో సుమారు 50 ఎకరాలకుపైగా పంట పొలాలు నీట మునిగాయి. అధికారులు వరద ముంపు ప్రాంతాలను సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు. మధ్యాహ్నం నుంచి వరద ఉధృతి తగ్గుముఖం పట్టినా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వరద ముంపు ప్రాంతాలను మండల స్పెషలాఫీసర్ తుల రవి, తహసీల్దార్ శ్రీనివాసులు, డీసీఆర్బీ



మంగపేట : నీటమునిగిన వరి నారుమడి

డీఎస్పీ శోభన్‌కుమార్, ఎస్సై రవికుమార్, ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు హీరా, మురళి, అజ్మత్, శ్రావణ్ సందర్శించి పరిశీలించారు.

కన్నాయిగూడెం : గోదావరి వరద ఉధృతికి మండలంలోని బుట్టాయిగూడెం, చింతగూడెం, ముప్పనపల్లి, సింగారం, ఏటూరు, కంతనపల్లి, గుర్రేవుల, తదితర గ్రామాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. రైతులు పోసిన వరి నారుమడులు గోదావరి నీటిలో తేలియాడుతుండడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. వరినాట్లకు ఆటంకం కలిగినట్టేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

బస్టాండ్‌లోనే ఆర్టీసీ బస్సులు



బస్టాండ్‌లోనే ఉండిపోయిన బస్సులు



బస్టాండ్‌లో ఆర్టీసీ సిబ్బంది

ఏటూరునాగారం : ఏటూరునాగారానికి చేరుకున్న 12 ఆర్టీసీ బస్సులు భారీ వర్షాలకు గుండ్లవాగు ప్రాజెక్టు కొట్టుకుపోగా వరంగల్–ఏటూరునాగారం నడుమ రాకపోకలు నిలిచిపోయి మండల కేంద్రంలోని బస్టాండ్‌లోనే ఉండిపోయాయి. దీంతో డూటీలో ఉన్న 30 మంది కండక్టర్లు, డ్రైవర్లు రహదారులపై రాకపోకలు మొదలు కావడం కోసం మూడ్రోజులుగా పడిగాపులు కాస్తున్నారు. పస్రా వద్ద రోడ్డు నిర్మాణం పూర్తయితే తప్ప బస్సులు, డ్రైవర్లు, కండక్టర్లు గమ్యస్థానానికి చేరుకునే అవకాశం లేదు. రోడ్డుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేసి బస్సుల రాకపోకలను పునరుద్ధరించాలని కండక్టర్లు, డ్రైవర్లు కోరుతున్నారు.

విద్యుత్ శాఖ లైన్‌మెన్ ఔదార్యం

ఏటూరునాగారంలో ఉండిపోయిన 25 మంది ఆర్టీసీ కండక్టర్లకు, డ్రైవర్లకు శనివారం నాడు విద్యుత్ శాఖ లైన్‌మెన్ కొండ సమ్మయ్య భోజనాలు అందించి ఔదార్యం చాటుకున్నారు.

కల్వర్టుకు మరమ్మతులు

కన్నాయిగూడెం : మండలంలోని సర్వాయి గ్రామ పంచాయతీ పరిధిలోని భూపతిపురంలో వర్షాలతో చెరువు మత్తడి నీటితో కోతకు గురైన కల్వర్టుకు అధికారులు శనివారం మరమ్మతులు పూర్తి చేశారు. రెండ్రోజుల క్రితం 'కోతకు గురైన భూపతిపురం రోడ్డు' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి పనులు పూర్తి చేశారు.

ఇళ్ల స్థలాలిప్పించాలని మంత్రికి వినతి

ఏటూరునాగారం : మండలంలోని బూటారం గ్రామానికి చెందిన 150 మంది గ్రామం తరచూ వరద ముంపునకు గురౌతున్న క్రమంలో తమకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరుతూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ గెస్ట్‌హౌజ్ వద్ద మంత్రిని వారు కలిసి సమస్యను వివరించారు. 1983లో వచ్చిన వరదలకు ఇళ్లు కొట్టుకుపోయాయని, 1986లో వరదలు రాగా సినిమా థియేటర్‌లో తలదాచుకున్నామని, 1992లో వచ్చిన వరదలకు అడవుల్లో చెట్ల మీద ఉన్నామని వాపోయారు. ప్రస్తుతం వైటీసీలో తలదాచుకున్నట్లు తెలిపారు. వరదలు వచ్చినప్పుడల్లా గ్రామాన్ని వదిలి ప్రాణాలను కాపాడుకునేందుకు పరుగులు తీయాల్సి వస్తోందని చెప్పారు. సురక్షితమైన ప్రభుత్వ స్థలం ఇప్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామస్తులు ముత్యంబాయి, శ్రీను, రామయ్య, రాములు, సమ్మయ్య, లక్ష్మి, అశోక్, మంగ, లక్ష్మయ్య, రవి తదితరులున్నారు.

బతుకమ్మ ఆటతో జీపీ కార్మికుల నిరసన



మంగపేట : బతుకమ్మ ఆడుతున్న జీపీ కార్మికులు



వాజేడు : సమ్మె చేస్తున్న కార్మికులు

మంగపేట : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద సమ్మె కొనసాగిస్తున్న జీపీ కార్మికులు శనివారం బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా కమిటీ సభ్యుడు చీకుర్తి కొమిరెల్లి, మండల అధ్యక్షుడు బోడ ఆదినారాయణ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈనెల 31న తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడికి మద్దతు తెలపాలని రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నాయకులను కోరారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి మద్దెల లక్ష్మయ్య, నాయకులు దశరధం, నర్సింహారావు, శ్రీనివాస్, రవి, ఆదినారాయణ, రామదాసు, మహేష్, వెంకటేశ్వర్లు, శ్రీను, రవి, రాజు, మాజిద్‌ఖాన్, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

వాజేడు : మండల కేంద్రంలో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగింది. కార్మికులు పాల్గొన్నారు.

గీత కార్మికులను అదుకోవాలి

ములుగు రూరల్ : అధిక వర్షాల కారణంగా కులవృత్తిని కోల్పోయిన గీత కార్మికులకు పరిహారం అందించి ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండబోయిన రవి గౌడ్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక్కో గీత కార్మికుడు సుమారు 10 రోజులుగా దినవారీగా వచ్చే ఆదాయాన్ని కోల్పోయారని వాపోయారు. గీత కార్మికులకు రూ.50 వేలు చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని ఆకాంక్షించారు. ఈ విషయమై ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్పందించాలని న్యాయం చేయాలని కోరారు.

గోదావరి శాంతించాలని పూజలు

మంగపేట : మండలంలోని కమలాపురం గ్రామస్తులు గోదావరికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఎగువ ప్రాంతంలోని ప్రాజెక్టుల నుంచి వరద నీరు విడుదల కాగా శుక్రవారం సాయంత్రం నుంచి వరద నీటి ఉధృతి పెరుగుతోంది. కమలాపురంలోని లోతట్టు ప్రాంతమైన గుడ్డేలుగులపల్లి సమీపంలోకి వరద నీరు చేరుకోవడంతో గ్రామానికి చెందిన మహిళలు గోదావరికి కొబ్బరికాయలు కొట్టి, పూలు, పసుపు, కుంకుమలు చల్లి పూజలు చేశారు. గోదావరి శాంతించాలని ఆకాంక్షించారు.

వాజేడు : వరద ఉధృతి తగ్గాలని కోరుతూ మండలంలోని నాగారం గ్రామానికి చెందిన



మంగపేట: గోదావరికి పూజ చేస్తున్న మహిళలు

వేములవాడ దుర్గ గోదావరికి శనివారం పూజలు చేశారు. తొలుత గోదావరికి పువ్వులు సమర్పించి కొబ్బరికాయ కొట్టి వరద ఉధృతి తగ్గాలని వేడుకుంది.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

వాజేడు : మండలంలోని కొంగాల గ్రామ సమీపంలో శనివారం రాత్రి ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో వాటిపై ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. వివరాలిలా.. కొంగాల గ్రామానికి చెందిన నర్సయ్య అతడి కొడుకు, మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న రాజు వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో రాజుకు, నర్సయ్యకు తీవ్రగాయాలయ్యాయి. అలాగే మిగతా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

రైతులు మెళకువలు పాటించాలి

టేకుమట్ల(రేగొండ): వర్షాకాలంలో రైతులు మెళకువలు పాటించాలని రేగొండ మండల వ్యవసాయాధికారి వాసుదేవరెడ్డి అన్నారు. రేగొండ మండలంలోని రామన్నగూడెం, నారాయణపూర్, సుల్తాన్‌పూర్, తిరుమలగిరి, రామన్నగూడెంతండా, భాగిర్థిపేట, మడ్తపల్లి, లింగాల కనిపర్తి, దామరంచపల్లి గ్రామాల్లోని పంటలను శనివారం ఆయన పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి పంపించనున్నట్లు తెలిపారు. పత్తి రైతులు అప్రమత్తంగా ఉంటూ మొక్క అడుగు భాగాన నీటి నిల్వలను నివారించి తేమను తగ్గించాలని సూచించారు. ప్రస్తుతం యూరియాతో పాటు పొటాష్‌ను మొక్కలకు వేయాలని తెలిపారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వాసుదేవరెడ్డి

అధిక వర్షాలతో నల్లనేలల్లో వేర్లు కుళ్లే ప్రమాదం ఉందని చెప్పారు. వరి రైతులు వెదజల్లే పద్ధతి, డ్రమ్ సీడర్ విధానంలో సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు ఉన్నారు.

సహాయక చర్యల్లో పోలీసులు



మోరంచపల్లి సహాయక చర్యల్లో వృద్ధుడిని మోసుకొస్తున్న రేగొండ పోలీసులు

టేకుమట్ల(రేగొండ): మండలంలోని మోరంచపల్లి వాగు ఉధృతితో ప్రవహిస్తుండగా జిల్లా ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు రేగొండ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తన సిబ్బందితో శనివారం ఆ గ్రామంలో సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రాణాలకు తెగించి పలువురు వృద్ధులను నీటి నుంచి రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వృద్ధులను పోలీసులు భుజాలపైకి ఎక్కించుకుని మోసుకుంటూ బయటకు తీసుకురావడం చర్చనీయాంశంగా మారింది.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

ఎస్‌ఎస్ తాడ్వాయి : వరద బాధితులు అధైర్య పడొద్దని జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోపాటు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వరద ముంపునకు గురైన మండలంలోని మేడారం, ఊరట్టం, కన్నెపల్లి, కాల్వపల్లి గ్రామాల్లో ఆమె పర్యటించారు. రోడ్లు బురదయయం కాగా ట్రాక్టర్‌లో ప్రయాణిస్తూ ప్రజల దుస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. బాధితులతో మాట్లాడి నష్టంపై ఆరా తీశారు. పునరావాస కేంద్రాలను సందర్శించి వరద బాధితులకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఇబ్బంది కలుగకుండా పర్యవేక్షించాలని సర్పంచులకు సూచించారు. గ్రామాల్లో త్వరితగతిన పరిస్థితులు మెరుగుపడేలా అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి



బాధితులతో మాట్లాడుతున్న నాగజ్యోతి

కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బాధితులను ప్రభుత్వం సత్వరమే ఆదుకునేలా చొరవ తీసుకుంటామని తెలిపారు. ఆమె వెంట మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, నాయకులు సిద్దబోయిన వసంతరావు తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడి ఔదార్యం



వాజేడు: గర్భిణి సౌందర్యను, ఫిట్స్‌కు గురైన వ్యక్తిని పడవలో తీసుకొస్తున్న రామకృష్ణారెడ్డి



ములుగు రూరల్ : వరద బాధితులకు భోజనం వడ్డిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఎస్‌ఎస్ తాడ్వాయి : సరుకులు అందజేస్తున్న సిద్దబోయిన జగ్గారావు

- గర్భిణికి, ఫిట్స్ బాధితుడికి తోడ్పాటు

వాజేడు : పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళతోపాటు అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని గోదావరి దాటించి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఔదార్యం చాటుకున్నారు. వివరాలిలా.. మండలంలోని పెద్ద గంగారం గ్రామానికి చెందిన ఆలం సౌందర్య పురిటి నొప్పులతో బాధపడుతుండగా కృష్ణాపురం సర్పంచ్ పూనెం నాగ చంద్ర అధికారులకు సమాచారం అందించింది. పెద్దగొళ్లగూడెం, చీకుపల్లి, గుమ్మడిదొడ్డి గ్రామాల సమీపంలోని జాతీయ రహదారిపైకి భారీగా గోదావరి వరద నీరు చేరడంతో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి నాటు పడవను తీసుకెళ్లి పురిటి నొప్పులతో బాధపడుతున్న సౌందర్యతోపాటు ఆమె భర్త కార్తీక్‌ను అందులో ఎక్కించాడు. అదే సమయంలో ధర్మవరం గ్రామానికి చెందిన ఒడిశెల సురేష్ ఫిట్స్‌కు గురి కాగా అక్కడికి చేరుకుని అతడిని సైతం పడవలో ఎక్కించి గుమ్మడిదొడ్డి వరకు తీసుకొచ్చాడు. అప్పటికే అక్కడ వాజేడు ఎస్సై వెంకటేశ్వర్‌రావు వారి కోసం అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచడంతో ఇద్దరినీ అంబులెన్స్‌లో ఏటూర్‌నాగారంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రికి గర్భిణి తరలింపు

మంగపేట : మండలంలోని రాజుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని వరద ముంపునకు గురైన దేవనగరానికి కాన్పు కోసం వచ్చిన గర్భిణిని ముందస్తు జాగ్రత్తలో భాగంగా బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్‌కుమార్ ఏటూరునాగారంలోని సామాజిక ఆస్పత్రికి శనివారం తరలించారు. ఇతర గ్రామాలకు చెందిన పలువురిని సైతం 108 వాహనంలో ఆస్పత్రికి పంపించారు.

కాంగ్రెస్ నాయకుడి చేయూత

ములుగు రూరల్ : పునరావాస కేంద్రంలోని వరద బాధితులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ దుప్పట్లు, దుస్తులతోపాటు నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం వెంకటకృష్ణ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సీతారామ్, శ్రీకాంత్, రాజేష్, అమర్, సోమయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు సరుకులు పంపిణీ

ఎస్‌ఎస్ తాడ్వాయి : జంపన్నవాగు వరద ముంపునకు గురైన క్రమంలో మేడారంలోని చిరువ్యాపారులకు ఐటీడీఏ నుంచి అందిన నిత్యావసర సరుకులు సమ్మక్క–సారలమ్మ పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఐటీడీఏ పీఓ అంకిత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వరద బాధితులను వెంటనే ఆదుకోవాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి

ములుగు రూరల్ : మండలంలోని గుండ్లవాగు, దయ్యాలవాగు ఉధృతి కారణంగా పంటలు నష్టపోయిన రైతులను, ఆస్తులు, సామగ్రి, నగదు నష్టపోయిన బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలను ఆ పార్టీ నాయకులతో కలిసి శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎడతెరిపి లేని వర్షాలకు పేదలు, రైతులు భారీగా నష్టపోయారని ఆందోళన వెలిబుచ్చారు. వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.50 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని, ఇతరత్రా నష్టపోయిన కుటుంబాలను సైతం తగిన రీతిలో యుద్ధప్రాతిపదికన ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి, నాయకులు బీరెడ్డి సాంబశివ, చిట్టిబాబు, ఆదిరెడ్డి, రాజేష్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి, నాయకులు

ముంపు ప్రాంతాల్లో అధికారుల పరిశీలన

వెంకటాపురం (కె) : మండలంలో గోదావరి వరద ముంపునకు గురైన ప్రాంతాలను మండల అధికారులు శనివారం సందర్శించి పరిశీలించారు. బల్లకట్టు వాగు, కుక్కతోగు వాగు బోదాపురం వద్ద వరద నీటిలోకి ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయడంతోపాటు పంచాయతీ కార్యదర్శులను కాపలా ఉంచారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అరవింద్‌రెడ్డి, తహసీల్దార్ అంటి నాగరాజు, ఎంపీడీఓ అడ్డూరి బాబు తదితరులు పాల్గొన్నారు.



గోదావరి వరదను పరిశీలిస్తున్న అధికారులు

వైద్యశిబిరం



వాజేడు : మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో వైద్యాధికారిణి జ్ఞానస శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ముంపు బాధితులను పరీక్షించి మందులు అందించారు. కార్యక్రమంలో వైద్య పర్యవేక్షకుడు కోటిరెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ



వాజేడు : మండలంలోని నాగారం గ్రామంలోని బీసీ కాలనీలో గోదవరి వరదతో ముంపునకు గురైన ఇళ్లను జెడ్పీటీసీ తల్లడి పుష్పలత సందర్శించి బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గోదావరి వరద తగ్గే అవకాశం ఉందని చెప్పారు. ఉధృతి పెరిగితే పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు.